క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ క్లస్టర్ అధ్యక్షుల నియామకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ క్లస్టర్ అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ ఉత్తర్వులను జారీ చేసింది. అందులో భాగంగా క్లస్టర్–1(37, 38, 39, 44 డివిజన్లకు) బొండా నీరేష్, క్లస్టర్–2(34, 35, 54, 55, 56) బాబు వాసా ఆదినారాయణ, క్లస్టర్–3 (40, 41, 42, 43, 45 డివిజన్లకు) కేసరి కృష్ణారెడ్డి, క్లస్టర్–4 (46, 47, 48, 49 డివిజన్లకు) అయితా కిశోర్, క్లస్టర్–5 (50, 51, 52, 53 డివిజన్లకు) బంకా చాముండేశ్వరిని నియమిస్తూ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది.

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఇస్మాయిల్ చారిటీస్ ఆధ్వర్యంలో గురువారం పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం జరిగింది. 38వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, పార్టీ నాయకులు షేక్ హయాత్ షరీఫ్ నేతృత్వంలో కుమ్మరిపాలెం సెంటర్‌లోని వారి నివాసం వద్ద 500 మంది మహిళలకు చీరలు, పురుషులకు లుంగీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెహమతున్నీసా మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో పేదలకు సహాయం చేయడం అంటే అల్లాహ్‌కు సేవ చేయడమేనన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఉన్నంతలో రంజాన్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. ప్రతి ఏటా రంజాన్ పండుగను పురస్కరించుకుని తమకు తోచినంతలో పేదలకు సాయం చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. మహమ్మద్ ప్రవక్త అనుగ్రహంతో అందరూ బాగుండాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో రంజానీ, నీలోఫర్, రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నందీశ్వరునికి రుద్రాభిషేకం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన పాత శివాలయంలో నందీశ్వరునికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని గురువారం నిర్వహించారు. నగరంలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం(పాతశివాలయం)లో త్రయోదశిని పురస్కరించుకొని ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి మాసంలోనూ త్రయోదశి రోజున నందీశ్వరునికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించటం ఆనవాయితీ. అందులో బాగంగా గురువారం సాయంత్రం ప్రదోషకాలంలో నందీశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారికి విశేష పుష్పాలంకరణ, పంచహారతులు, ప్రత్యేక అభిషేకాలను ఆలయ అర్చకులు చేపట్టారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సహజీవనం చేస్తున్న వ్యక్తి అనుమానంతో పెట్రోల్ పోసి నిప్పు పెట్టిన ఘటనలో మహిళ గురువారం మృతి చెందింది. కేఎల్‌రావు నగర్ కుండల మార్కెట్ ప్రాంతానికి చెందిన వీర్ల చంద్రకళ కొంత కాలంగా తుమ్మెపల్లి పుల్లారావుతో సహజీవనం చేస్తోంది. కొంత కాలంగా పుల్లారావు, ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. ఈ నెల 22న ఇంట్లో నిద్రపోతున్న ఆమెపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టాడు. ఘటనలో తీవ్రగాయాల పాలైన చంద్రకళ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. ఘటనపై కొత్తపేట పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు.

సీఎం చంద్రబాబుకు కొరియర్ ద్వారా ఉగాది పచ్చడి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లు కొరియర్ ద్వారా ఉగాది పచ్చడి పంపారు. తాము పంపిన ఉగాది పచ్చడి తిని అయినా తమకు ఇచ్చిన హామీ గుర్తు తెచ్చుకోవాలని వలంటీర్లు వేడుకున్నారు. గురువారం ఏలూరు రోడ్డులోని డీటీడీసీ కొరియర్ ద్వారా ఉగాది పచ్చడిని చంద్రబాబుకు పంపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వలంటీర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లంక గోవిందరాజులు మాట్లాడుతూ 2024 సంవత్సరం ఉగాది రోజున చంద్రబాబు వలంటీర్లకు ఇచ్చిన హామీని గుర్తు చేశారు. ఉగాది పండుగ రోజు వలంటీర్లకు తీపి కబురు అంటూ రూ. 5వేల గౌరవ వేతనం ఏం సరిపోతుందని కూటమి అధికారంలోకి వస్తే నెలకు రూ. 10వేలు ఇస్తానని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 2.60లక్షల మంది వలంటీర్లను చంద్రబాబు నమ్మబలికాడన్నారు. కానీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క రూపాయి వేతనం ఇవ్వలేదని అన్నారు. కనీసం ప్రత్యామ్నాయం చూపకుండా వలంటీర్లను రోడ్డున పడేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవోల పేరుతో 2.60లక్షల మంది వలంటీర్ల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందన్నారు. ఇప్పటికైన రాష్ట్రంలో వలంటీర్లను కొనసాగించి ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు సరోజిని, నరేష్, కళ్యాణ్, షైనీ, శివ పార్వతి, స్వప్న పాల్గొన్నారు.

పీఎస్‌లో తుప్పపట్టిపోతున్న వాహనాలు

- అధ్వానంగా స్టేషన్ పరిసరాలు
- ఫీజులు, చలానా భారం భరించలేక వదిలివేస్తున్న యజమానులు



భవానీపురం పోలీసు స్టేషన్‌లో సీజైన బైక్‌లు



చెట్ల పొదల్లో తుప్పపట్టి పోతున్న ఆటోలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పలు కేసుల్లో పోలీసులు సీజ్ చేసిన వాహనాలు తుప్పుపట్టి పోతున్నాయి. విలువైన బైక్‌లు, ఆటోలు, కార్లు ఇతర రవాణా వాహనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. ఈ వాహనాలను పోలీసులు స్టేషన్ ప్రాంగణంలో ఉంచడంతో స్టేషన్ పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. పోలీసు స్టేషన్‌లో భద్రపరిచిన వాహనాల మధ్యలో చెట్లు మొలిచి పాడుబడ్డ దివానాలను తలపిస్తోంది. భవానీపురం పోలీసు స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలు వందల సంఖ్యలో ఉన్నాయి. వాహనాలు పూర్తిగా పాడై అటు వాహన యజమానులు రూ.లక్షల్లో నష్టపోతున్నారు. ఇటు వేలం వేయకుండా ఉంచడంతో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం నష్టపోవాల్సి వస్తోంది. సుదీర్ఘ కాలం వాహనాలు నిలిపి ఉంచడంతో వాటి రూపురేఖలు మారిపోయాయి.

ప్రమాదాలు నిత్యకృత్యం..

భవానీపురం స్టేషన్ పరిధి గట్టువెనుక 8 డివిజన్లతో పాటు గొల్లపూడి, సూరంపల్లి వరకు విస్తరించి ఉంది. సూరంపల్లి నుంచి దుర్గగుడి వరకు జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఈ దారిలో నిత్యం ఏదో ఒక రోడ్డు ప్రమాదం జరుగుతూనే ఉంటోంది. ప్రమాదాల బారిన పడిన వాహనాలు పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌లో ఉంచుతారు. ఇవి గాక దొంగతనాలు, అక్రమ మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటివి తరలించే వాహనాలు పట్టుబడ్డ సమయంలో వాటిని పోలీసు స్టేషన్‌కు తరలించి ఆవరణలో భద్రపరుస్తారు. అలా కాకుండా ఎటువంటి పత్రాలు లేని వాహనాలు పట్టుబడుతుంటాయి. ఈ కేసుల్లో నిందితులు తమ వాహనాలకు కోర్టు ద్వారా రిలీజ్ ఆర్డర్ తెచ్చుకోవాల్సి ఉంటుంది. కానీ పత్రాలు లేకపోవడం, లాయర్ ఫీజులు భరించలేక వదిలి వేస్తుంటారు. దీంతో వాహనాలు సుదీర్ఘకాలం పోలీసు స్టేషన్ ఆవరణలో దుమ్ముకొట్టుకుపోతున్నాయి.

వాహనాలు పాడవడంతో వదిలేస్తున్నారు..

ఎండకు ఎండి వానకు తడవడంతో పనికి రాకుండా పోతున్నాయి. కొన్ని వాహనాలు ఒకటి రెండు నెలలు పాటు రిలీజ్ ఆర్డర్ రాకపోవడంతో ఇంజిన్ జామ్ అయిపోతుందని పార్టీలు వాటిని తీసుకెళ్లేందుకు నిరాకరించే పరిస్థితి వస్తుంది. ఇక అన్ క్లెయిమ్డ్ వాహనాలు భారీగా పడి ఉంటున్నాయి. వాస్తవానికి ప్రమాదం జరిగినప్పుడో... లేదా మాదక ద్రవ్యాల తరలిస్తూనో పట్టుబడితే ఆ వాహనాలను కోర్టు ట్రయల్ నాటికి ప్రొడ్యూస్ చేస్తామని చెప్పి యజమాని తీసుకెళ్లవచ్చు. అందుకు రశీదు ఇచ్చి వాహనాన్ని తీసుకెళ్లే సౌకర్యం ఉంది. కానీ కొన్ని కారణాల చేత అలా జరగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసులకు వీటి రికార్డులు నిర్వహణ, వాటిని భద్రపరచడం భారంగానే ఉంటోంది. కొందరు చాలా ఆలస్యంగా రిలీజ్ ఆర్డర్‌లు తెచ్చుకోవడం అప్పటికే వాహనం రూపురేఖలు మారిపోవడంతో ఉద్దేశపూర్వకంగానే కొందరు వదిలివేసి వెళ్లిపోతున్నారు. దీంతో వాహనాలు పోలీసు స్టేషన్ ఆవరణలో భారీగా పేరుకుపోతున్నాయి.

పరిసరాలు అధ్వానం..

పోలీసు స్టేషన్‌లకు సకల సౌకర్యాలతో నూతన భవనాలు సమకూరుతున్నాయి. భవానీపురం పోలీస్ స్టేషన్‌కు నూతన భవనం ఒనగూరింది. భవనానికి ఆనుకుని వెనుక ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలు గుట్టలుగా పడి ఉన్నాయి. వాహనాలు నిలిపి ఉన్న చోట పిచ్చి మొక్కలు మొలిచాయి. పూర్తిగా దుమ్ముకొట్టుకుపోయాయి. కనీసం షెడ్ లాంటిది కూడా లేకపోవడంతో వాహనాల్లో దాదాపు 90 శాతం పనికి రాకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు పోలీసు స్టేషన్ వెనుక, ఎదురు కొంత భాగం అధ్వానంగా తయారైంది. వాహనాలను రిలీజ్ ఆర్డర్ ఇవ్వడమో.. లేక వేలం వేయడం ద్వారా పరిసరాలు ఖాళీ చేస్తే అందమైన పూల మొక్కలు సిబ్బంది వాహనాలు నిలుపుకొనేందుకు వీలుగా షెడ్ నిర్మాణం చేసుకోవచ్చు.

గత ప్రభుత్వంలో వాహనాలకు వేలం

గత ప్రభుత్వంలో మద్యం, గంజాయి వంటి అక్రమ రవాణాకు వాహనాలు వినియోగించిప ట్టుబడితే వాటిని నిర్దిష్టకాలానికి వేలం వేసే విధానాన్ని తీసుకువచ్చింది. ప్రతి మూడు నాలుగు నెలలకు అప్పటి వరకు సీజ్ వాహనాలను బహిరంగ వేలం వేశారు. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. పోలీసు స్టేషన్‌లలోనూ పాత వాహనాలు ఉండేవి కావు. పరిసరాలు అందంగా ఉండేవి. ప్రస్తుతం సెబ్, ఎక్సైజ్‌లో విలీనం చేయడంతో ఆ విధానం అమలు కావడం లేదు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తేలికపాటి ఆహారం తీసుకోవడం, నీరు ఎక్కువగా తాగడం వంటి చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వడదెబ్బ బారిన పడకుండా ఉండవచ్చని హోమియో వైద్యుడు సీహెచ్ కిశోర్ కుమార్ అన్నారు. కేబీఎన్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన గురువారం విజయవాడ నగర పరిధిలోని వివిధ పాఠశాల్లో వడదెబ్బ నివారణ పట్ల అవగాహన, ఉచిత హోమియో మందు పంపిణీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర్‌కుమార్ మాట్లాడుతూ.. వదులుగా ఉండే దుస్తులు వేసుకోవాలని, కొబ్బరినీరు, బార్లీ, మజ్జిగ వంటి చలవ చేసే ద్రవాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు హోమియో మందు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, డి.పవన్ కుమార్, జి.సీతారత్నం, పి.గౌతమి, ఎన్.సాంబశివ రావు, స్టూడెంట్ వలంటీర్లు పాల్గొన్నారు.

30న త్రిశక్తి పీఠంలో పంచాంగ శ్రవణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో విశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ఈ నెల 30వ తేదీ సాయంత్రం 6.15 గంటల నుంచి పంచాంగ శ్రవణం జరుగుతుందని ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు వసంత రాత్రులు సందర్భంగా అమ్మ వార్లకు నిత్య అభిషేకం, పుష్పార్చన నిర్వహిస్తామన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన పెంచుకోండి

సీబీఐ స్పెషల్ కోర్టు జడ్జి కేఎస్ రామకృష్ణ



మాట్లాడుతున్న జడ్జి కేఎస్ రామకృష్ణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని సీబీఐ స్పెషల్ కోర్టు జడ్జి కె.ఎస్.రామకృష్ణ అన్నారు. స్థానిక మొగల్రాజపురంలోని రత్నమాంబ వీధిలోని మాస్టర్ మైండ్స్ కళాశాల ఆవరణలో మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం సాయంత్రం జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ.. బాలిక పట్ల బాలురు అనుచితంగా ప్రవర్తిస్తే పోక్సో చట్టం కింద కేసు నమోదవుతుందన్నారు. ఈ చట్టం కింద కేసు నమోదు అయితే యువత భవిష్యత్తు నాశనం అవుతుందని చెప్పారు. విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. మైనర్లపై పోక్సో చట్టం కింద కేసు నమోదు అయితే వారికి జువైనల్ హోమ్‌కు పంపుతారని చెప్పారు. జీవితంలో కళాశాలలో చదివే రోజులు చాలా సంతోషంగా ఉంటాయని, చక్కగా చదువుకుని ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవాలని చెప్పారు. పోక్సో చట్టం ప్రకారం బాలిక తల్లిదండ్రులు ఇచ్చే ఫిర్యాదుకు చట్ట ప్రకారం చాలా పటిష్టంగా ఉంటుందని చెప్పారు. పోక్సో చట్టంలోని అంశాలపై అవగాహన పెంచాలనే ఉద్దేశంతో కళాశాలకు వెళ్లి ఈ చట్టంపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ పీపీ కె.కల్యాణ్ చక్రవర్తి, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, న్యాయవాదులు డి.ఆంజనేయ ప్రసాద్, రంగయ్య, ఎన్.నాగప్రసాద్, కోర్టు సూపరింటెండెంట్ నాంచారయ్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం విద్యార్థుల సందేహాలను రామకృష్ణ నివృత్తి చేశారు.

సిద్ధార్థలో నేడు కురుక్షేత్ర - 2కే25



పోస్టర్‌ను ఆవిష్కరించిన కళాశాల ప్రతినిధులు, విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్న విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు శుక్రవారం సిద్ధార్థ ఆడిటోరియంలో కురుక్షేత్ర–2కే25 పేరుతో వివిధ అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. కళాశాలలోని సెమినార్ హాల్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల మధ్య స్నేహపూర్వక పోటీతత్వం రూపొందించేందుకు గత 28 సంవత్సరాలుగా కురుక్షేత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల డీన్ ప్రొఫెసర్ రాజేష్ సి జంపాల మాట్లాడుతూ.. బిజినెస్ క్విజ్, స్టాక్ మార్కెట్ గేమ్, యంగ్ మేనేజర్, మార్కెట్ మేకర్స్, హెచ్ఆర్ ఈవెంట్, న్యూ ఐడియా కాంటెస్ట్, డ్యాన్స్, ట్రెజర్ హంట్, మిస్టర్ అండ్ మిసెస్ కురుక్షేత్ర–2కే25 పేరుతో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఉమ్మడి కృష్ణా జిల్లాతో పాటు గుంటూరు, తెనాలి, ఏలూరు ప్రాంతాల నుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈవెంట్ సమన్వయకర్త డాక్టర్ ఎండీఎస్.రహమాన్, అధ్యాపకులు డాక్టర్ ఎస్‌బీ.రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు, ఏఎస్ఎన్.లక్ష్మి, డాక్టర్ కె.అరుణ్‌కుమార్, బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు తేజేశ్వరరావు, కల్యాణ్, భాను, పూజిత, లిఖిత, భాగ్య, తేజస్విని, భువనచంద్ర తదితరులు పాల్గొన్నారు.

చేతి వృత్తులపై అవగాహన అవసరం



ఫీల్డ్ స్టడీ టూర్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ శరవణకుమార్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగ విద్యార్థులు ఆయా స్థానిక చేతి వృత్తులపై అవగాహన పెంచుకోవాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణ కుమార్ అన్నారు. ఆ కళాశాల మేనేజమెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలోని 'సంస్కృతి పునరుద్ధరణ' పేరుతో కళంకారి కళపై ఫీల్డ్ స్టడీ కార్యక్రమాన్ని పెడనలో నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ తమ స్థానిక ప్రాంతాల్లో ఉన్న వృత్తులు, సంస్కృతులను అర్థం చేసుకొని నూతన వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం కళంకారి కళలో పలువురు ప్రముఖుల అనుభవాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఎస్.మణికంత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

2న దుకాణాల లీజుకు బహిరంగ వేలం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ శ్రీ విజయేశ్వర స్వామి వారి దేవస్థానానికి చెందిన దుకాణాలను అద్దెకిచ్చేందుకు ఏప్రిల్ రెండో తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వెంకట్‌రెడ్డి తెలిపారు. రెండో తేదీ ఉదయం 10 గంటలకు దేవస్థానం ఆవరణలో వేలం జరుగుతుందన్నారు. దేవదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ ఆదేశాల మేరకు తనిఖీ అధికారి సృజన్ పర్యవేక్షణలో వేలం నిర్వహిస్తామని చెప్పారు. షాపులు అద్దెకు కావలసినవారు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించి, డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని ఈవో తెలిపారు.

30న వాసవీ అమ్మవారి మందిరంలో ఉగాది వేడుకలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సౌమ్య థియేటర్ సమీపంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరంలో విశ్వావసు నామ సంవత్సరాది వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 30వ తేదీ ఆదివారం తెల్లవారుజామున 5.31 గంటలకు అమ్మవారికి సుప్రభాత సేవ అనంతరం గణపతి పూజ, అభిషేకం జరుగుతుందన్నారు. సాయంత్రం పంచాంగ శ్రవణం, సామూహిక మహాలక్ష్మీ దేవి పూజ, సౌందర్యలహరి, మణిద్వీప వర్ణన జరుగుతుందని తెలిపారు.

ఘనంగా సెయింట్ జాన్స్ స్కూల్ వార్షిక వేడుకలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక క్రాంబ్వే రోడ్‌లోని సెయింట్ జాన్స్ పాఠశాల 40వ వార్షిక వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్‌డీఎంఎస్ఎంకే మహిళా కళాశాల డీన్ డాక్టర్ ఆర్.మాధవి మాట్లాడుతూ జీవితానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు కృషి, పట్టుదల, అంకిత భావంతో ముందుకు వెళితే ఫలితం అద్భుతంగా ఉంటుందన్నారు. మరో అతిథి సెయింట్ జాన్స్ విద్యా సంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ టి.సుమన్ త్యాగరాజ్ మాట్లాడుతూ తమ విద్యా సంస్థలోని విద్యార్థుల ఆసక్తిని గమనించి ఆయా అంశాలలో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో సెయింట్ జాన్స్ స్కూల్ ప్రెసిడెంట్ టి.మోనిక సుమన్, ప్రిన్సిపాల్ కేవీ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

పన్నుపై వడ్డీ మాఫీని సద్వినియోగం చేసుకోండి



నోటీసులు జారీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లింపులపై 50 శాతం వడ్డీ మాఫీని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సచివాలయ సిబ్బంది సూచించారు. 48వ డివిజన్ పరిధిలోని ఇంటి పన్ను, ఖాళీ స్థలాలు, నీటి పన్నులు బకాయిలు ఉన్న నివాసితులకు కార్పొరేషన్ సిబ్బంది గురువారం నోటీసులు జారీ చేశారు. మార్చి 30 నాటికి బకాయిలు ఉన్న ప్రతి ఒక్కరూ పన్నులను చెల్లించాలని సూచించారు. డివిజన్ పరిధిలోని సాధుజాన్ వీధి, రాయప్ప రాజు వీధి, టీనర్‌పేట అడ్డరోడ్డు పరిధిలోని నోటీసులు జారీ చేశారు. కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన పనులను సకాలంలో చెల్లించాలని, ఏప్రిల్ 1 తర్వాత బకాయిదారుల నివాసితుల ఇంటి కుళాయి కలెక్షన్లు తొలగిస్తామన్నారు. నెలాఖరులోగా బకాయిల మొత్తాన్ని చెల్లించాలని సూచించారు.

వార్డు సచివాలయాల్లోనూ పన్నుల చెల్లింపు

పటమట(విజయవాడతూర్పు): ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లింపులపై 50 శాతం వడ్డీ మాఫీకి నాలుగు రోజులు మాత్రమే గడువు ఉందని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన పన్ను బకాయిల వడ్డీపై 50 శాతం రాయితీ పొందేందుకు ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందన్నారు. పన్నుల చెల్లింపుదారుల కోసం విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని 13 క్యాష్ కౌంటర్లు అన్ని ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటాయని చెప్పారు. విజయవాడ నగర పరిధిలోని 286 సచివాలయాల్లోనూ పన్ను చెల్లింపులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

నేటి బీబీఏ ఎన్నికలకు సర్వం సిద్ధం

విజయవాడలీగల్: 2025–26 సంవత్సరానికి గానూ బెజవాడ బార్ అసోసియేషన్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం జరిగే ఎన్నికల్లో 1998 మంది పురుష ఓటర్లు, 721 మంది మహిళా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. సివిల్‌కోర్టు ప్రాంగణం పక్కనే ఉన్న కె.ఎల్.రావుభవన్‌లో పురుషులు, లైబ్రరీ హాలులో మహిళలు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రధాన ఎన్నికల అధికారి డి.పి.రామకృష్ణ కోరారు. ఓటు హక్కును వినియోగించుకునే న్యాయవాదులు తప్పనిసరిగా బార్ అసోసియేషన్ గుర్తింపు కార్డు లేదా హైకోర్టు గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు. ఉపాధ్యక్ష పదవికి పిల్లా శ్రీనివాసరావు, 30 ఏళ్లు పైబడిన విభాగంలో పి.వి.ఏడుకొండలు మాత్రమే మాత్రమే నామినేషన్ వేయడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండేళ్లు పైబడిన విభాగంలో ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా 14 మందికి అవకాశం ఉండగా, 14 మంది మాత్రమే నామినేషన్ వేయడంతో వారు కూడా ఏకగ్రీవమయ్యారని ప్రధాన ఎన్నికల అధికారి ప్రకటించారు.

పోటీలో అధ్యక్ష పదవికి ఎ.కె.బాషా, బి.డేవిడ్ రత్నకుమార్, వి.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి పదవికి బి.నాగేశ్వరరావు, ఆర్.చునాథ్, కె.వి.రంగారావు, ఎస్.వి.వి.సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరీ పదవికి జి.వి.లక్ష్మి, కె.సుబ్బారావు, ట్రెజరర్ పదవికి ఐ.రవీంద్రనాథ్, ఎం. సత్యనారాయణ, లైబ్రరీ సెక్రటరీగా కె.త్రినాథ్‌కుమార్, పి.సత్యనారాయణ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా కె.నవీన్‌కుమార్, పి.రవిబాబు, లేడీ సెక్రటరీగా జి.మాలతి, కె.అనురాధ పోటీ చేస్తుండగా, 20 ఏళ్లు పైబడి ఇద్దరు, 10 ఏళ్లు పైబడి 9 మంది పురుష, ఇద్దరు మహిళా న్యాయవాదులు పోటీ చేస్తున్నారు.

కారు, జీప్ ఢీ కొట్టిన ఘటనపై కౌంటర్ కేసులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళలు ప్రయాణిస్తున్న కారును జీప్‌తో అడ్డగించడమే కాకుండా ఢీ కొట్టిన వ్యక్తిపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన షేక్.భుసరా(32) కొత్తపేట మస్తాన్ వీధికి చెందిన సయ్యద్ నసీమా స్నేహితులు. రంజాన్ పండుగ నేపథ్యంలో రెండు రోజుల కిందట నసీమా హైదరాబాద్‌లోని స్నేహితురాలి వద్దకు వెళ్లి పండుగ షాపింగ్ చేసి తిరిగి ఇంటికి వచ్చారు. అయితే అదే సమయంలో భుసరా, నసీమాలు నడుపుతున్న కార్‌ను స్థానికంగా నివాసం ఉండే షేక్.అన్వర్ తన జీపుతో ఢీ కొట్టాడు. అంతే కాకుండా ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను సైతం ఢీ కొట్టాడు. ఘటనపై భుసరా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కౌంటర్ కేసు నమోదు

సయ్యద్ నసీమా, షేక్.ఇమ్రాన్, భుసరాలు తన జీప్‌ను కారుతో ఢీ కొట్టి, కర్రలతో దాడి చేశారని అన్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం తెల్లవారుజామున నమాజ్ ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో ముగ్గురు తన జీప్ అద్దాలు పగలగొట్టి గాయపరిచినట్లు అన్వర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

● పవిత్రతను కాపాడటమంటే ఇదేనా !



విజయవాడ రథం సెంటర్ బొడ్డుబొమ్మ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు



విజయవాడ నగరంలో మొబైల్ టాయిలెట్స్ అరకొరగా ఉన్నాయి. దీంతో నగర వాసులు బహిరంగ ప్రదేశాల్లో మూత్ర విసర్జన చేస్తున్నారు. వీరిని నియంత్రించేందుకు నగరపాలక సంస్థ అధికారులు హిందువులు పవిత్రంగా ఆరాధించే దేవుళ్ల ఫొటోలు, అమ్మవారి రూపాలతో కూడిన ఫ్లెక్సీలను ప్రకాశం బ్యారేజీ బొడ్డు బొమ్మ విగ్రహం వద్ద పెట్టి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీనిపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హిందూ మత పవిత్రతను కాపాడటమంటే ఇదేనా అంటూ, సంబంధిత అధికారులు ఫ్లెక్సీలను తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

● మధురానగర్(విజయవాడసెంట్రల్): హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన గురువారం దివ్యాంగుడు వెంకటేశ్వరరావుకు వీల్‌చైర్ అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కోరంగ నాగమల్లీశ్వరి మాట్లాడుతూ ఒక కాలు లేని వెంకటేశ్వరరావు వీల్ చైర్ లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో ట్రస్ట్ సభ్యుల సహకారంతో వీల్ చైర్ అందజేస్తున్నట్లు తెలిపారు.